
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5
సిద్దిపేట
మంగళవారం 4 జూన్ 2024



మెదక్ పార్లమెంట్ మ్యాప్

20 రోజుల ఉత్కంఠకు నేటితో తెరపడనున్నది. మరికొన్ని గంటల్లో లోక్‌సభ ఎన్నికల ఫలితం వెల్లడికానున్నది. మెదక్ లోక్‌సభ నుంచి 44 మంది అభ్యర్థులు ఎన్నికల కదనరంగంలో తలపడగా గెలుపు ఎవరిని వరిస్తుందో సాయంత్రం వరకు తేటతెల్లంకానున్నది. మెదక్ బిగ్‌ఫైట్‌లో ఎవరిని విజయం వరిస్తుందో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. త్రిముఖ పోటీలో ఏ పార్టీ విజయకేతనం ఎగురవేయనున్నదో ఆసక్తి నెలకొన్నది. మెదక్ కంచుకోటను బీఆర్ఎస్ మరోసారి నిలుపుకుంటుందా.. లేదా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో ఏదీ గులాబీ కోటను బద్దలుకొడుతుంది అని రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అలాగే సిద్దిపేట జిల్లా పరిధిలో ఉన్న భువనగిరి, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థుల భవితవ్యం మరికొద్ది గంటల్లో తేలనున్నది.

ఓట్ల లెక్కింపునకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. మెదక్ లోక్‌సభ కౌంటింగ్ నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల, గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. 147 రౌండ్లలో మెదక్ ఫలితం తేలనున్నది. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానున్నది. 9.30 గంటల తర్వాత తొలిరౌండ్ ఫలితం వెల్లడికానున్నది.

# విజేత ఎవరో?

## నేడు తేలనున్న ఫలితం .. 20 రోజుల ఉత్కంఠకు తెర.. ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- బరిలో 44 మంది అభ్యర్థులు
- ముగ్గురి మధ్యే పోటీ
- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- మొదట పోస్టల్ ఓట్ల లెక్కింపు
- 9.30 తర్వాత తొలిరౌండ్ ఫలితం
- సాయంత్రం వరకు తుది ఫలితం వెల్లడి
- కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

మెదక్, జూన్ 3 : పార్లమెంట్ ఎన్నికల ఫలితాలకు కౌంట్‌డౌన్ మొదలైంది. మెదక్ లోక్‌సభ ఎన్నికల విజేత ఎవరో తేలనున్నది. గత నెల 13న జరిగిన పోలింగ్‌లో ఓటర్లు తీర్పును ఇవ్వగా, ఈవీఎంలలో నిక్షిప్తమైన ఫలితం నేడు వెల్లడికానున్నది. మెదక్ జిల్లాలోని నర్సాపూర్, మెదక్, సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, సంగారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్లతో కూడిన మెదక్ లోక్‌సభ పరిధిలో 44 మంది అభ్యర్థులు బరిలో నిలిచి తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు.

### కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ బీవీఆర్ఐటీ కళాశాలలో, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు గిరిజన గురుకుల కళాశాలలో లెక్కింపును పర్యవేక్షిస్తారు. లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరు గదుల్లో టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్నది. ఓట్ల లెక్కింపు కోసం సిబ్బందిని ఉదయం 6 గంటల వరకే కౌంటింగ్ కేంద్రాలకు రావాలని ఆదేశించారు. అలాగే కౌంటింగ్ ఏజెంట్లు కూడా 6 గంటల కల్లా చేరుకోనున్నారు. సరిగ్గా 8 గంటలకు లెక్కింపు మొదలు పెట్టేలా ఎన్నికల యంత్రాంగం చర్యలు చేపట్టింది. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లను నిషేధించారు. ఎవరు సెల్‌ఫోన్లు తీసుకురావద్దని, అలాగే రికార్డింగ్‌కు సంబంధించి ఎలక్ట్రానిక్ పరికరాలు వేటిని అనుమతించడం లేదు. కౌంటింగ్ ప్రక్రియ అంతా సీసీ కెమెరాల పర్యవేక్షణలో కొనసాగుతుంది. సెగ్మెంట్ల వారీగా లెక్కింపును సీసీ కెమెరాల ద్వారా మానిటరింగ్ చేస్తున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో లెక్కింపు ప్రారంభిస్తారు. అరగంట తర్వాత ఎనిమిదిన్నరకు ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది.

### వివిధ బ్లాకులలో సెగ్మెంట్ల వారీగా ఏర్పాట్లు

నర్సాపూర్ బీవీఆర్ఐటీ కళాశాలలోని విశ్వేశ్వరయ్య బ్లాకులో మెదక్ సెగ్మెంట్, ఆర్యభట్ట బ్లాకులో సిద్దిపేట, దుబ్బాక, సెగ్మెంట్లు, ఎమ్మిడి నర్సయ్య బ్లాకులో నర్సాపూర్ సెగ్మెంట్, చాణుక్య బ్లాకులో గజ్వేల్ సెగ్మెంట్ ఓట్లను లెక్కించనున్నారు. అదేవిధంగా గిరిజన గురుకుల కళాశాలలో సంగారెడ్డి సెగ్మెంట్, ఒకటో అంతస్తులో పటాన్‌చెరు సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. పోలింగ్ కేంద్రాల సంఖ్యను అనుసరించి లెక్కింపునకు రౌండ్లను నిర్ణయించారు. వీటిపై కంట్రోల్ యూనిట్లను ఏర్పాటు చేసి అభ్యర్థుల వారీగా ఓట్లు లెక్కిస్తారు. ఫారం 17ను పరిశీలించాకే పోలైన ఓట్లను పోల్చి చూసి అన్ని టేబుళ్ల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్లను రౌండ్ల వారీగా ప్రకటిస్తారు. ఈ ప్రక్రియపై పూర్తి నిఘా కొనసాగనుంది. 199 క్లోజ్‌డ్ కెమెరాలను అమర్చారు. ఎన్నికల ఫలితాలను ఎప్పటికప్పుడు తెలియడానికి ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు.

### భారీ భద్రత మధ్య లెక్కింపు

లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. బీవీఆర్ఐటీ కళాశాల, ప్రభుత్వ గిరిజన గురుకుల కళాశాలల వద్ద 650 మందితో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు. సీఆర్‌పీఎఫ్, సివిల్, ఆర్మ్‌డ్ పోలీస్‌ఫోర్స్‌తో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా మూడు ప్లాటూన్ల సీఆర్పీఎఫ్ బలగాలు పహారాలో ఉన్నాయి.


నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

### మెదక్ కౌంటింగ్ రెండు చోట్ల

- నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కౌంటింగ్ కేంద్రంలో గజ్వేల్, మెదక్, నర్సాపూర్, దుబ్బాక, సిద్దిపేట అసెంబ్లీ సెగ్మెంట్లు
- నర్సాపూర్‌లోని గిరిజన గురుకుల విద్యాలయంలో సంగారెడ్డి, పటాన్‌చెరు అసెంబ్లీ సెగ్మెంట్ల కౌంటింగ్

### మొదట పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు

తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు మొదలైన సమయంలో రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో పోలైన పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు మొదలు కానున్నది. హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులతో పాటు 85 సంవత్సరాల వయసు పైబడిన వారికి ఇంటివద్దే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడంతో మెదక్ లోక్‌సభ పరిధిలో 1,635 మంది ఓట్లు వేశారు. ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సదుపాయం కల్పించడంతో 14,297 మంది ఓటు వేశారు. 507 మంది సర్వీస్ ఓటర్లు తమ ఓట్లు వేయగా, ఓట్ల లెక్కింపు రోజు ఉదయం 8 గంటల వరకూ వచ్చిన ఓట్లను కూడా లెక్కలోకి తీసుకుని ఆతర్వాత పూర్తి స్థాయిలో లెక్కించనున్నారు.

### తొలి ఫలితం దుబ్బాక

మెదక్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఈవీఎం యూనిట్లను తెరిచి ఓట్ల లెక్కింపును చేపడతారు. అన్ని సెగ్మెంట్ల కంటే దుబ్బాకలో తక్కువగా 19 రౌండ్లు ఉన్నాయి. తొలుత దుబ్బాక కౌంటింగ్ పూర్తయి ఫలితం వెల్లడి కానున్నది. ఆ తరువాత 20 రౌండ్లు ఉన్న సిద్దిపేట, మెదక్ ఫలితాలు వస్తాయి. అనంతరం 21 రౌండ్లు ఉన్న సంగారెడ్డి, 22 రౌండ్ల చొప్పున ఉన్న గజ్వేల్, నర్సాపూర్ వెల్లడికానున్నాయి. చివరగా 23 రౌండ్లు ఉన్న పటాన్‌చెరు సెగ్మెంట్ కౌంటింగ్ పూర్తవుతుంది.

| | |
|---|---|
| కౌంటింగ్ కేంద్రం | బీవీఆర్ఐటీ కళాశాల గిరిజన గురుకుల విద్యాలయం నర్సాపూర్ |
| బరిలో నిలిచిన అభ్యర్థులు | 44 |
| అసెంబ్లీ సెగ్మెంట్లు | 7 |
| మొత్తం ఓటర్లు | 18,28,210 |
| పోలైన ఓట్లు | 13,72,894 |
| ఏర్పాటు చేసిన మొత్తం టేబుళ్లు | 103 |
| మొత్తం కౌంటింగ్ రౌండ్లు | 147 |
| ఓట్లు లెక్కించే ఏఆర్వోలు | 7 |
| కౌంటింగ్ సూపర్‌వైజర్లు | 103 |
| కౌంటింగ్ అసిస్టెంట్లు | 110 |
| మైక్రో అబ్జర్వర్లు | 117 |
| పోలీస్ సిబ్బంది | 650 |



## భువనగిరి, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో..

చేర్యాల/హుస్నాబాద్, జూన్ 3 : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల ఫలితాలు ఇటు బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్‌లోనూ ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి. ఎన్నికల బరిలో 39 మంది నిలిచినా ప్రధాన పోరు బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్, కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మధ్య నువ్వా..నేనా అన్నట్లు కొనసాగింది.

### సిద్దిపేట జిల్లాలో నాలుగు మండలాలు

భువనగిరి పార్లమెంట్ పరిధిలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలు సిద్దిపేట జిల్లాలో ఉన్నాయి. చేర్యాల మండలంలో 34,194 మంది, కొమురవెల్లి మండలంలో 11,815, మద్దూరు మండలంలో 12,927, ధూళిమిట్ట మండలంలో 9,884 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. జనగామ నియోజకవర్గవ్యాప్తంగా 74.68శాతం పోలింగ్ నమోదైంది.

### 112 టేబుళ్లు.. 140 రౌండ్లలో లెక్కింపు

భువనగిరి శివారులోని అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో 112 టేబుళ్లలో 140 రౌండ్లలో లెక్కింపు చేపట్టనున్నారు. జనగామ నియోజకవర్గ పరిధిలోని 278 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 14 టేబుళ్లలో 20 రౌండ్లలో లెక్కింపు చేయనున్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్లు లెక్కించిన అనంతరం సెగ్మెంట్లవారీగా పోలింగ్‌కేంద్రాల ప్రాతిపదికన రౌండ్లవారీగా లెక్కించనున్నారు. చివరిఫలితం మధ్యాహ్నం వరకు పూర్తికానుంది. జనగామ నియోజకవర్గ ఓటర్లు 2009లో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, 2014లో బూర నర్సయ్యగౌడ్, 2019లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అండగా నిలిచారు. ఇక నాలుగవసారి జరిగిన ఈ ఎన్నికలో ఎవరిని ఆశీర్వదిస్తారనేది ఆసక్తిని కలిగిస్తుంది.

### హుస్నాబాద్ మెజార్టీ ఎవరికి దక్కేనో..

కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో మంగళవారం ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ మేరకు ఉదయం 14 టేబుళ్లలో 22 రౌండ్లలో లెక్కింపు చేపట్టనున్నారు.

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గంలో ఈ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ ఏర్పడింది. నియోజకవర్గంలో హుస్నాబాద్, కోహెడ, చిగురుమామిడి, భీమదేవరపల్లి, సైదాపూర్, ఎల్కతుర్తి, అక్కన్నపేట మండలాలు ఉన్నాయి. 95,618 పురుషులు, 96184 మంది మహిళలు, 2 ట్రాన్స్‌జెండర్లతో మొత్తం 1,91,804 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో 77.43 శాతం పోలింగ్ నమోదైంది.

### హేమాహేమీల మధ్య పోరు

కరీంనగర్ పార్లమెంట్‌లోని హుస్నాబాద్ నియోజకవర్గంపై ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు మెజార్టీపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ వచ్చే ఇక్కడ వచ్చే మెజార్టీ తమ గెలుపునకు దోహదం చేస్తుందనే నమ్మకంతో ఉన్నారు. బీజేపీ నుంచి ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్, బీఆర్ఎస్ నుంచి మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్, కాంగ్రెస్ నుంచి దివంగత వెలిచాల జగపతిరావు కుమారుడు వెలిచాల రాజేందర్‌రావు పోటీలో ఉన్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత నియోజకవర్గం కావడంతో గెలుపు కోసం దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు భారీ మెజార్టీ లభిస్తుందనే అభిప్రాయంతో ఉన్నారు. బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్ నియోజకవర్గంలోని ప్రతీ మండలంలో ప్రచారం చేశారు. పట్టణ ఓటర్లతో పాటు ఇక్కడ సైలెంట్ ఓట్లు మొదటి స్థానంలో నిలుపుతాయనే నమ్మకంతో ఉన్నారు. గత పదేండ్లు అధికారంలో ఉండటంతో ప్రతి గ్రామంలో పార్టీ పటిష్టంగా ఉందని, దీనికి తోడు మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌లు ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ప్రచారం చేశారు. ఇది అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్‌కు కలిసివచ్చి మెజార్టీ ఓట్లు వస్తాయనే భావనతో ఉన్నారు. కాగా సిద్దిపేట జిల్లాలో ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల ఓటర్లు ఎవరిని అక్కున చేర్చుకుంటారో..? మరికొన్నిగంటల్లో తేలనున్నది.



### ఎవరు గెలిచినా రికార్డే..

మెదక్ సెగ్మెంటులో ప్రస్తుతం ఏ పార్టీ అభ్యర్థి గెలిచినా కొత్త రికార్డు నమోదవుతుంది. 2004, 2009, 2014, 2014 ఉప ఎన్నిక, 2019 ఎన్నికల్లో వరుసగా ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే గెలుపొందారు. 20 ఏళ్లుగా ఆ పార్టీకి ఈ సీటు కంచుకోటగా మారింది. ఇప్పుడు గెలిస్తే వరుసగా ఆరుసార్లు గెలిచిన రికార్డు బీఆర్ఎస్ సొంతమవుతుంది. అంతేగాకుండా 25ఏళ్ల పాటు ఆ పార్టీ అభ్యర్థులే ఎంపీలుగా ఉన్న రికార్డు కూడా దక్కుతుంది. ఇక మెదక్ స్థానానికి 18 సార్లు ఎన్నికలు జరిగితే 9 దఫాలుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. ఆ పార్టీ ఇప్పుడు విజయం సాధిస్తే 10 సార్లు గెలిచిన రికార్డుతోపాటు బీఆర్ఎస్ కంచుకోటను బద్దలుకొట్టిన ఘనత సైతం సొంతమవుతుంది. అదే విధంగా 1999లో యేవరకు రాత్రిదాకా ఎదురుచూడక తప్పదనే పరిస్థితి నెలకొన్నది.

### బీఆర్ఎస్ పార్టీకి కీలకం..

జాతీయ రాజకీయాల్లో అడుగుపెట్టడానికి టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చడంతో అప్పట్లో కేసీఆర్ పేరు దేశమంతటా చర్చకు దారితీసింది. పలు రాష్ట్రాల్లో పార్టీ విస్తరణకు ప్రయత్నాలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థులను ఆయా ఎన్నికల్లో బరిలో దింపారు. అయితే, గత అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం సొంత రాష్ట్రంలోనే బీఆర్ఎస్‌కు ఓటమి తప్పలేదు. దీంతో ఇతర రాష్ట్రాల్లో ఆ పార్టీకి, కేసీఆర్‌పై విశ్వాసం సన్నగిల్లింది. పార్లమెంటు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేయడానికి సైతం వెనుకంజ వేసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ఎన్నికల్లో ఆ పార్టీకి అనుకూల పరిస్థితులు వస్తేనే భవితవ్యం ఉంటుందని, లేకపోతే మరింత లోతున పడకతప్పదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక్కడ గెలవకుంటే బీఆర్ఎస్ ఇంకెక్కడా గెలిచే పరిస్థితి లేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అందుకే మెదక్ సీటే బీఆర్ఎస్ భవితవ్యాన్ని నిర్ణయించనున్నది. దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిన బీఆర్ఎస్ పార్టీ పరిస్థితిపై ఆరా తీయడం మొదలుపెట్టారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో మెదక్ సీటు హాట్‌టాపిక్‌గా మారింది.

# కంచుకోట పదిలమేనా!

- మెదక్ సీటుపైనే బీఆర్ఎస్ ఆశలు
- ఎగ్జిట్ పోల్ ఫలితాలతో ఉత్కంఠ
- పోలింగ్ సరళిపై బీజేపీ, కాంగ్రెస్ ధీమా
- రసవత్తరంగా మారిన మెతుకుసీమ
- మరికాసేపట్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 3 : మరికాసేపట్లో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయి. తమ పార్టీకి కంచుకోటగా నిలుస్తున్న మెదక్‌లో మళ్లీ తామే పాగా వేస్తామంటూ బీఆర్ఎస్ కోటి ఆశలు పెట్టుకుంది. ఈ ప్రాంతంలోని ఉద్యమ నేపథ్యంతోపాటు అభివృద్ధి, దీనికితోడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సర్వశక్తులు ఒడ్డారు. అంతేగాకుండా బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి పార్టీ బలంతోపాటు తన సొంత హామీలు కూడా కలిసివస్తాయనే అంచనాలు ఉన్నాయి. వీటన్నింటితో పాటు తాజా ఎగ్జిట్‌పోల్ ఫలితాల్లోనూ మెదక్‌లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని మెజార్టీ ఏజెన్సీలు చెప్పకనే చెప్పాయి. కొన్ని ఏజన్సీలు మాత్రం ఇక్కడ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు విజయం సాధిస్తారని ప్రకటించాయి. గత పార్లమెంటు ఎన్నికలతో పాటు గడిచిన దుబ్బాక అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన రఘునందన్‌కు అనుకూల వాతావరణం కనిపించిందని, మోదీ చరిష్మా కలిసివచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇక కాంగ్రెస్ పార్టీ కూడా సైలెంట్ ఓటింగ్‌పై నమ్మకం పెట్టుకుంది. తమ అభ్యర్థి నీలం మధు బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడమే తమకు ప్లస్ పాయింట్ అని చెబుతున్నారు. చాపకింద నీరులా మహిళల ఓట్లన్నీ కాంగ్రెస్ పడ్డాయనే ధీమాలో ఉన్నారు.

ఇక్కడి నుండి ఆలె నరేంద్ర బీజేపీ తరఫున బరిలోకి దిగి ఎంపీగా గెలిచారు. అంతకుముందు, ఆ తర్వాత బీజేపీ ఇక్కడ కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోయింది. ఇప్పుడు మళ్లీ గెలిస్తే బీఆర్ఎస్ రికార్డులను బ్రేక్ చేయడంతోపాటు ఇందిరా నియోజకవర్గంగా పేరున్న ఇక్కడ బీజేపీ పాగా వేసిందనే ఘనతను దక్కించుకున్నట్లవుతుంది. అందుకే మూడు పార్టీలు మెదక్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి.

### 9 నుంచి 9:30 మధ్య తొలి ఫలితం..

ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. చేతితో లెక్కించడం వల్ల మొదటి రౌండ్‌కు కనీసం గంట సమయం తీసుకుంటారు. అంతేగాకుండా 44 మంది అభ్యర్థులు బరిలో ఉండడంతో మరింత సమస్యం పట్టే అవకాశం ఉంది. దీంతో 9 గంటల నుంచి 9.30గంటల మధ్య తొలి ఫలితం అది కూడా పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించిన ఫలితం వెలువడనుంది. వీరిలో వృద్ధులు, దివ్యాంగులు, ప్రభుత్వ ఉద్యోగులే ఉంటారు. ప్రభుత్వ ఉద్యోగుల వైఖరి సైతం ఈ పోస్టల్ బ్యాలెట్లతో తేలనున్నది. ఇక ఈవీఎంలను లెక్కించడం కూడా ఆలస్యమే అవుతుంది. 44 మందికి పోలైన ఓట్లను లెక్కించడం ఇబ్బందికర పరిణామమే. పూర్తి ఫలితాలు వెల్లడ



ఓట్ల లెక్కింపునకు

## పటిష్ఠ భద్రత

- సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు లేవు
- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

7లో

## చిన్న పొరపాటు కూడా జరగొద్దు

- కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన మెదక్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్
- అధికారులు, సిబ్బందికి పలు సూచనలు

నర్సాపూర్, జూన్ 3: మెదక్ పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌లో ఏ చిన్నపొరపాటు కూడా జరగకూడదని మెదక్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్ సిబ్బందికి సూచించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు ప్రత్యేకంగా ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అందుకోసం బీవీఆర్ఐటీలో నర్సాపూర్, మెదక్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ సెగ్మెంట్ల ఐదు బ్లాకులలో ఏర్పాటు చేయగా సంగారెడ్డి, పటాన్‌చెరు సెగ్మెంట్ల లెక్కింపు గిరిజనగురుకులంలో చేపట్టనున్నారు. సోమవారం ఆయన ఈ రెండు కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కౌంటింగ్‌లో పాల్గొనే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్నపొరపాటు కూడా చేయకూడదని చెప్పారు. ఈ కౌంటింగ్‌కు ప్రత్యేకంగా కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి ముగ్గురు పరిశీలకులు హాజరుకానున్నారు. మెదక్, నర్సాపూర్ సెగ్మెంట్లకు ఒకరు, పటాన్‌చెరు, సంగారెడ్డి సెగ్మెంట్లకు ఒకరు, అలాగే సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాకకు ఒక పరిశీలకుడు చొప్పున నియమించారు.



నర్సాపూర్‌లో ఓ కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేస్తున్న కలెక్టర్, ఆర్వో రాహుల్‌రాజ్

## క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

కల్హేర్, జూన్ 3: మండల పరిధిలోని మాసాన్‌పల్లి గ్రామంలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మాసాన్‌పల్లికే చెందిన సాయికిరణ్‌రెడ్డి, మహేందర్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్ పోటీలో సాయికిరణ్ జట్టు మహేందర్ జట్టుపై విజయం సాధించి కప్పు కైవసం చేసుకున్నారు. విన్నర్, రన్నరప్ జట్లకు కల్హేర్ ఎస్ఐ వెంకటేశం బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజుగౌడ్, శివాజీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.













## విత్తనాలు అందించడంలో విఫలం

● బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 3: రైతులకు విత్తనాలు అందించడంలో సర్కారు విఫలమైందని బీజేపీ కిసాన్‌మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్‌రెడ్డి విమర్శించారు. విత్తనాల విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫసల్ బీమా యోజనను తెలంగాణలో అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, జిల్లా నాయకులు మాణిక్‌రెడ్డి, పట్టణ కిసాన్‌మోర్చా అధ్యక్షుడు లింగమూర్తి, జిల్లా కార్యాలయ కార్యదర్శి దోమల విజయకుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు నాగరాజు తదితరులు ఉన్నారు.

### నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి

మెదక్ అర్బన్: రైతుల సమస్యలను పరిష్కరించి, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతుల సమస్యలను కలెక్టర్ దృష్టి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానకాలం సీజన్ ప్రారంభమవుతుండున్న రైతులకు కావాల్సిన విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. పంట నష్టం జరగకుండా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేయాలని కోరారు. లేదంటే ఆందోళనలకు దిగుతామని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు.


సంగారెడ్డిలో మాట్లాడుతున్న కిసాన్‌మోర్చా నాయకులు








## 22మంది విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

చిలప్‌చెడ్, మే 3: ఇంటర్‌నేషనల్ సైకిల్‌డేను పురస్కరించుకుని సోమవారం మెదక్ జిల్లా ఫైజాబాద్ ఉన్నత పాఠశాలలో 22మంది విద్యార్థినులకు హైదరాబాద్‌కు చెందిన హైదరాబాద్ సైకిల్ గ్రూపు ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లను చేశారు. పాఠశాలకు కాలినడకన వస్తున్న అజ్జమర్రికి చెందిన 20 మంది, ఫైజాబాద్‌కు చెందిన ఇద్దరి విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. రవాణా ఖర్చులను అజ్జమర్రి మాజీ సర్పంచ్ పరశురాంరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌సిజి గ్రూపు సభ్యులు సుభాష్, రవీందర్, పాఠశాల హెచ్‌ఎం తారాసింగ్ పాల్గొన్నారు.


ఫైజాబాద్ పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లను అందజేస్తున్న దృశ్యం






# గాలివాన బీభత్సం

- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు

కంగ్టి/కొల్చారం, జూన్ 3: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని చాప్టా.కెలో ఆదివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పలు గ్రామాల్లో తేలిక పాటి వర్షం కురిసినప్పటికీ చాప్టా.కె గ్రామంలో వర్షానికి తోడు తీవ్రమైన గాలులు వీచాయి. దీంతో దాదాపు పది ఇళ్ల రేకులు ఎగిరిపోయాయి. ఇండ్ల పైఉన్న రేకులు ఎగిరిపడడంతో అలేఖ్య అనే పదకొండేళ్ల చిన్నారికి, జగదేవి అనే మహిళకు గాయాలయ్యాయి. రెండు కరెంట్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ తీగలు తెగి కరెంట్ సరఫరా నిలిచి పోయింది. భారీ చెట్లు సైతం నేలకొరిగాయి. నష్టం జరిగిన ఇళ్లకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం కోనాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన వరిధాన్యంతో పాటు బస్తాలు తడిసి ముద్దయ్యాయి. ఆలస్యంగా వచ్చిన వరికోతలకు తోడు, సకాలంలో లారీలు రాకపోవడం, తూకం వేసిన వరిధాన్యం బస్తాల తరలింపులో జాప్యంతోనే ధాన్యం తడిసి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోనాపూర్‌లో తడిసిన ధాన్యాన్ని జిల్లా పౌరసరాల అధికారి బ్రహ్మారావు ఆదివారం పరిశీలించారు. తడిసిపోయిన వరిధాన్యం బస్తాలను తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మరో రెండు, మూడు రోజుల పాటు కేంద్రం కొనసాగింపునకు చర్యలు తీసుకోవాలని సొసైటీ వైస్ చైర్మన్ మోత్కు మల్లేశం, రైతులు కోరారు. తడిసిపోయిన వరిధాన్యం బస్తాల వివరాలను రంగంపేట సొసైటీ సీఈవో నవీన్ నమోదు చేసుకున్నారు.



వర్షాలు కురుస్తుండడంతో రైతులు విత్తనాల కొనుగోలులో నిమగ్నమయ్యారు. ఖేడ్‌లోని దుకాణం వద్ద రైతులు ఇలా విత్తనాలు కొనుగోలు చేస్తూ కనిపించారు. - నారాయణఖేడ్



కంగ్టి మండలం చాప్టా.కెలో గాలికి ఎగిరిపోయి చెట్టుపై ఇరుక్కు పోయిన రేకు



కంగ్టి మండలం చాప్టా.కెలో నేలకొరిగిన చెట్టు



కొల్చారం: కోనాపూర్‌లో తడిసిముద్దయిన వరిధాన్యం బస్తాలు



## ప్రజలకు ఇబ్బందులు కలగకుండా

# హైవే పనులు పూర్తి చేయాలి

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



రోడ్డు విస్తరణ బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జూన్ 3: వర్షాకాలం దృష్ట్యా హుస్నాబాద్ పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాతీయ రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం హుస్నాబాద్ పట్టణంలో జరుగుతున్న నేషనల్ హైవే పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు విస్తరణలో నష్టపోతున్న బాధితులతో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా రోడ్డు పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా పనులు జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. రోడ్డు నిర్మాణం జరిగితే ఇళ్లల్లోకి వరద నీరు రాకుండా ఉంటుందన్నారు. ఆయనవెంట మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, జేఏసీ కో ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కోమటి సత్యనారయణ ఉన్నారు.

## కేంద్రంలో అధికారం కాంగ్రెస్‌దే

- మంత్రి దామోదర్ రాజనర్సింహ

జహీరాబాద్, జూన్ 3: దేశంలో ప్రజలు మార్పును కోరుకుంటున్న నేపథ్యంలో కేంద్రంలో తామే అధికారంలోకి వస్తామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో ప్రజలు మార్పును కోరి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చిన తరహాలోనే కేంద్రంలో కూడా మార్పు జరగనుందన్నారు. నేడు వెలువడనున్న ఫలితాలు ఇండియా కూటమికి అనుకూలంగా ఉంటాయని ధీమా వ్యక్తం చేశారు.

## సిద్దిపేట జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా మహేష్



సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 3: ఏడు రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'వ్యవసాయ శాఖలో గందరగోళం' కథనానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం స్పందించింది. హుస్నాబాద్ ఏడీఏగా విధులు నిర్వర్తిస్తున్న పి.మహేష్‌కు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు కలెక్టర్ మను చౌదరిని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## ధాన్యం కుప్పను ఢీకొని గాయపడిన వ్యక్తి మృతి

మనోహరాబాద్, జూన్ 3: రోడ్డుపై ధాన్యం కుప్పను ఢీకొని గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్‌కు చెందిన పత్తిరి యాదగిరి(40) గత నెల 27న రాత్రి 8 గంటలకు పని నిమిత్తం మనోహరాబాద్ నుంచి గజ్వేల్‌కు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. రంగాయపల్లి శివారులోని అగ్రహారం వెళ్లే దారిలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. గత నెల 28న మృతుడి కూతురు పత్తిరి అఖిల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రశాంతంగా పది సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభం

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్, జూన్ 3: పదోతరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణ కోసం మెదక్ జిల్లాలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో తొలిరోజు 226 మంది విద్యార్థులకు గానూ.. 185 మంది (81.86శాతం) హాజరు కాగా 41 మంది గైర్హాజరైనట్లు డీఈవో రాధికిషన్ తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్, రామచంద్రాపురంలోని జడ్పీ హైస్కూల్, జహీరాబాద్‌లోని సిద్దార్థ హైస్కూల్ కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 249 మందికి 208 మంది హాజరుకాగా, 41 మంది గైర్హాజరయ్యారు. 83.53 శాతం హాజరు నమోదైందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా రామచంద్రాపురం జడ్పీహైస్కూల్ కేంద్రాన్ని డీఈవో వెంకటేశ్వరు పరిశీలించారు.

## ఫిర్యాదులను పరిష్కరించాలి: ఎస్పీ

మెదక్ అర్బన్, జూన్ 3: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ బాలస్వామి పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు అర్జీలు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

## హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలిపిన మోయిద్‌ఖాన్



నారాయణఖేడ్, జూన్ 3: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ సెల్ నేత మోయిద్‌ఖాన్ సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. పుష్పగుచ్చం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మోయిద్‌ఖాన్

# త్వరలో టీచర్ల బదిలీలు, ప్రమోషన్లు!

- ఎన్నికల కోడ్ అనంతరం ప్రక్రియ చేపట్టే అవకాశం
- ఈ నెల రెండో వారంలో షెడ్యూల్ విడుదలకు ఛాన్స్

సంగారెడ్డి అర్బన్, జూన్ 3: ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. వివిధ కారణాలతో గతేడాది బదిలీలు, ప్రమోషన్లకు బ్రేక్ పడిన విషయం తెలిసిందే. గతేడాది విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం గెజిటెడ్ హెచ్‌ఎంల పదోన్నతులు విజయవంతంగా పూర్తయ్యాయి. అయితే ప్రమోషన్లకు టెట్ అవసరమని, అందుకు ఎన్‌సీటీఈ నిబంధనలున్నాయంటూ కొందరు టీచర్లు హైకోర్టును ఆశ్రయించడంతో గతేడాది అక్టోబరులో బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా టెట్ అర్హతతో సంబంధం లేకుండానే ప్రమోషన్లు ఇవ్వొచ్చని ఇటీవల హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పదోన్నతులకు మార్గం సుగమమైంది. కాగా ఎన్నికల కోడ్ ముగియగానే ప్రభుత్వ అనుమతితో ఈ నెల రెండో వారంలో బదిలీలు, ప్రమోషన్లను చేపట్టాలని విద్యాశాఖ భావిస్తున్నది.

### గతేడాది జరిగిన బదిలీలు, పదోన్నతులు

సంగారెడ్డి జిల్లాలో గతేడాది జరిగిన గెజిటెడ్ హెచ్‌ఎంల బదిలీల్లో ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ఆరుగురు, జడ్పీ హైస్కూల్(లోకల్‌బాడీ)పరిధిలో 86మంది మొత్తం 92 మంది జీహెచ్‌ఎంలు బదిలీ కాబడ్డారు. ఇతర జిల్లాల నుంచి సంగారెడ్డి జిల్లాకు 11 మంది జీహెచ్‌ఎంలు బదిలీపై వచ్చారు. జీహెచ్‌ఎంల బదిలీ తర్వాత ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ఎనిమిది, జడ్పీ యాజమాన్య పరిధిలో 61మంది మొత్తం 69 జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఆ తర్వాత ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 13 మంది స్కూల్ అసిస్టెంట్లు జీహెచ్‌ఎం(గ్రేడ్-2)గా పదోన్నతి పొందగా, ఇతర జిల్లాల నుంచి సంగారెడ్డికి ఐదుగురు జీహెచ్‌ఎంలు పదోన్నతిపై వచ్చారు. ఈ జిల్లా నుంచి 80 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. ఇలా ఉండగా జిల్లాలో 5,947 టీచర్ పోస్టులు మంజూరు కాగా 5,079 మంది ప్రస్తుతం పనిచేస్తురు. 868 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నెలలోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపడుతామన్న సంకేతాల నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అప్రమత్తమైంది. ఈ మేరకు సీనియారిటీ జాబితా సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు ఆ వర్గాలు తెలిపాయి.



సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయం

# జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు

- వేర్వేరు చోట్ల నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన సిద్దిపేట ఏసీపీ మధు

సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు, జూన్ 3: జల్సాలకు అలవాటుపడి దొంగతనాల బాటపట్టిన ఇద్దరి నిందితులను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సిద్దిపేట ఏసీపీ కార్యాలయంలో కేసుల వివరాలను సిద్దిపేట ఏసీపీ జి.మధు వెల్లడించారు. సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏప్రిల్ నెలలో ఇర్కోడు గ్రామ శివారులోని మల్లన్న గుడిలో దుండగులు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి తన సిబ్బందితో కలిసి ఇర్కోడు శివారులో సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా చిట్యాల రాజిరెడ్డి పోలీసులను చూసి ఆటోలో పారిపోవడానికి ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. విచారించగా గుడిలో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. జల్సాలకు అలవాటు పడిన రాజిరెడ్డి రాత్రి వేళల్లో నిర్మానుష్యంగా ఉండే గ్రామ శివారులోని ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు ఏసీపీ తెలిపారు. సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తోర్నాల, ఇర్కోడు, మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం, లక్ష్మీనగర్, కాసులాబాద్, చిన్నకోడూరు, రాంసాగర్, అనాజీపేట్ గ్రామాల్లోని ఆలయాల్లో చోరీలకు పాల్పడినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడి నుంచి 13.5 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ మధు చెప్పారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ అపూర్వరెడ్డిని, సిబ్బందిని ఏసీపీ అభినందించారు. సమావేశంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

### రామునిపట్లలో చైన్ స్నాచర్ అరెస్టు

జల్సాలకు డబ్బుల కోసం వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితుడిని చిన్నకోడూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఏసీపీ జి.మధు తెలిపారు. చిన్నకోడూరు మండలంలోని రామునిపట్ల శివారులో సోమవారం ఉదయం చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుమ్మం రాకేశ్ బైక్‌పై సిద్దిపేట వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్నాడు. పోలీసులను చూసి భయాందోళనకు గురవుతుండగా అతడిని ఆపి తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు లభించాయి. వాటి వివరాలు అడగగా తడబడుతూ సమాధానం చెప్పాడు. అనుమానం వచ్చి విచారణ చేయగా జల్సాల కోసం పలు చోట్ల చైన్ స్నాచింగ్‌లు చేశానని నిందితుడు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి 5.9 గ్రాముల బంగారు ఆభరణాలు, చైన్ స్నాచింగ్‌కు ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ బాలకృష్ణను, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.




వివరాలు వెల్లడిస్తున్న సిద్దిపేట ఏసీపీ మధు



# ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రత

- సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు లేవు
- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు
- సంగారెడ్డి, మెదక్ జిల్లాల ఎస్పీలు రూపేష్, బాలస్వామి
- గీతం వద్ద 750 మందితో మూడంచెల బందోబస్తు

సంగారెడ్డి క్రైం, జూన్ 3: పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రతను పోలీసులు ఏర్పాటు చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో జహీరాబాద్ లోక్‌సభ ఓట్ల లెక్కింపును మంగళవారం చేపట్టనున్నారు. లెక్కింపు కేంద్రం వద్ద జిల్లా పోలీసులు, కేంద్ర బలగాలు కలిసి మొత్తం 750 మందితో మూడంచెల విధానంతో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. లెక్కింపు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి ఏర్పాట్లను, భద్రతా పరమైన అంశాలను పరిశీలించారు. కౌంటింగ్ సెంటర్ పరిసర ప్రాంతాలతో పాటు జిల్లా వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం 6గంటల నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. మద్యం దుకాణాలను మూసివేయించినట్లు తెలిపారు. బందోబస్తుకు వచ్చిన పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్దకు వచ్చే వారికి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, పార్కింగ్ ఏరియాలలో వాహనాలను పార్కింగ్ చేసే విధంగా చూడాలన్నారు. మొబైల్ ఫోన్లు, అగ్గిపెట్టెలు, బాణాసంచాలు, లైటర్ల వంటి నిషేధిత పేలుడు పదార్థాలు కౌంటింగ్ కేంద్రాల వద్దకు తీసుకొని రాకుండా చూడాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల లోపల, బయట పరిసరాలు అన్ని సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయని వెల్లడించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అన్ని రకాల భద్రతాపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సంఘ విద్రోహ శక్తులెవరైనా కౌంటింగ్ ప్రక్రియకు ఆటంకం కలిగించాలని చూసినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో వుటుందని, నలుగురి కంటే ఎక్కువ మంది కానీ గుంపులు గుంపులుగా తిరగరాదన్నారు. పార్టీ జెండాలు, పార్టీ కండువాలు ధరించరాదని, పార్టీ గుర్తులు, ప్లకార్డులు ప్రదర్శించరాదని, మైకులు, లౌడ్‌స్పీకర్లు, ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు జిల్లా ప్రజలు ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఎంపీ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని, రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డులను కలిగి ఉన్న వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ వివరించారు.



సీసీ కెమెరాల నిఘాలో గీతం యూనివర్సిటీలోని కౌంటింగ్ కేంద్రం

### నర్సాపూర్ బీవీఆర్ఐటీ కళాశాల వద్ద 423 మందితో..

మెదక్ అర్బన్: మెదక్ లోక్‌సభ ఓట్ల లెక్కింపును నర్సాపూర్‌లోని బీవీఆర్ ఐటీ కళాశాల, అల్లూరి సీతారామరాజు(ట్రైబల్ వెల్ఫేర్) పాఠశాలల్లో చేపట్టనున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 423 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామని మెదక్ ఎస్పీ బాలస్వామి తెలిపారు. డీఎస్పీలు ఏడుగురు, సీఐలు 14, ఎస్ఐలు 42, ఏఎస్ఐ,హెడ్ కానిస్టేబుల్ 80, మహిళ పోలీసులు, హోంగార్డులు 61 మంది, 3 ప్లాటూన్‌ల టీజీఎస్పీ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జిల్లా పరిధిలో ఏ చిన్న పాటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బలగాలతో కట్టుదిట్టమైన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదన్నారు. నిబంధలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. కౌంటింగ్‌కు హాజరై ఏజెంట్లు, అధికారులకు సెల్‌ఫోన్లు, నిషేధిత వస్తువులు కేంద్రంలోకి తీసుకురావద్దని సూచించారు. ఎలక్షన్ కమిషన్ ద్వారా జారీ చేసిన గుర్తింపు కార్డులు ఉంటేనే లోనికి అనుమతి ఉంటుందన్నారు. అధికారులు, ఏజెంట్లు, మీడియాకు ప్రవేశాలు, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఆ స్థలంలోనే పార్కింగ్ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని మెదక్ ఎస్పీ బాలస్వామి వెల్లడించారు.



ఎస్పీలు రూపేష్, బాలస్వామి

# స్కూల్ యూనిఫామ్స్‌ను సకాలంలో అందించాలి

● డీఈవో శ్రీనివాసరెడ్డి



బెజ్జంకి: కుట్టు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాసరెడ్డి

బెజ్జంకి/కోహెడ, జూన్ 3: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఏకరూప దుస్తులను సకాలంలో అందించాలని డీఈవో శ్రీనివాసరెడ్డి అన్నారు. విద్యార్థులకు యూనిఫామ్స్ అందించేందుకు బెజ్జంకి, గాగిల్లాపూర్‌లో నిర్వహిస్తున్న కుట్టు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో త్వరగతిన దుస్తులను కుట్టి పంపిణీ చేయాలని సూచించారు. ఆయనవెంట ఐకేపీ ఏపీఎం నరసయ్య, సీసీలు తిరుపతి, సారయ్య తదితరలు ఉన్నారు. కోహెడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి అన్ని పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో రంగనాథ్, హెచ్‌ఎం మహమ్మూద్, మంజుల తదితరులున్నారు.

# వేగంగా సిద్ధమవుతున్న యూనిఫామ్స్

● గడువులోపు అందించేలా ఏర్పాటు

● ఇప్పటికే 2 వేల జతలు సిద్ధం

దౌల్తాబాద్, జూన్ 3: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టే పనిని ఈసారి ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు అప్పగించింది. గతంలో ఇదే పనిని గుత్తేదారులకు ఇచ్చేవారు. వారు దుస్తులను పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఇచ్చేవారు కాదు. దీంతో కొంతమంది విద్యార్థులకు మాత్రమే ఏకరూప దుస్తులు అందేవి. ఇటీవల ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి గురించి ఆలోచించి దుస్తులు కుట్టే పనిని వారికి అప్పగించింది. వచ్చే నెల ఆరులోపు పాఠశాలలకు దుస్తులు అందేలా వీవోలు ప్రణాళికలు రూపొందించారు.

## 35 పాఠశాలలు, 3,126 మంది విద్యార్థులు

మండలంలోని 24 గ్రామ పంచాయతీలో 35 పాఠశాలలకు చెందిన 1,532 మంది బాలికలు,1,594 మంది బాలురు మొత్తం 3,126 మంది విద్యార్థులకు ఒక జత యూనిఫాం చొప్పున కుడుతున్నారు. ఒక జతకు రూ.75 కుట్టుకూలీ ఇస్తున్నారు. విద్యార్థులకు సరిపడా దుస్తులు కుట్టేందుకు ఏడు క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లోని 41 మంది మహిళా సంఘాల్లో ఉన్న మహిళలకు యూనిఫాం కుట్టే బాధ్యత అప్పగించడంతో వారు వేగంగా కుట్టేస్తున్నారు. జూన్ 5 వరకు దుస్తులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని ఆదేశాలున్నాయి. దీంతో మహిళలు రాత్రి పగలు తేడా లేకుండా పనిలో నిమగ్నమయ్యారు.



దౌల్తాబాద్‌లో యూనిఫామ్స్ కుడుతున్న మహిళలు

## అధికారుల పర్యవేక్షణ

మండల సమైక్యలో విధులు నిర్వహిస్తున్న ఏపీఎంతో పాటు సీసీలు ప్రతి రోజూ ఆయా కేంద్రాలకు వెళ్లి దుస్తులను సిద్ధం చేసే పనులను పర్యవేక్షిస్తున్నారు. రోజు వారి సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేస్తున్నారు. ఇప్పటికే జిల్లా, మండల అధికారులు కుట్టు కేంద్రాలను సందర్శించి తగు సలహాలు, సూచనలు చేసి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

### పునఃప్రారంభం నాటికి పంపిణీ



పాఠశాలల పునఃప్రారంభం నాటికి పిల్లలకు దుస్తులను పంపిణీ చేస్తాం. ఈసారి మహిళలు కుట్టు పనులను త్వరగా పూర్తి చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికే ప్రభుత్వం మహిళా సంఘాలకు పనులు అప్పగించింది.

- బండి నర్సవ్వ, ఎంఈవో
దౌల్తాబాద్ మండలం

### గడువులోగా అందిస్తాం



అధికారులు ఆదేశించిన విధంగా ఈనెల 5 లోపు విద్యార్థులకు యూనిఫాం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 2వేల యూనిఫాం జతలు సిద్ధంగా సిద్ధమైయ్యాయి. సీసీలు ఎప్పటికప్పుడు ఆయా కేంద్రాలను పరిశీలిస్తున్నారు.

- బాల్‌రాజ్, ఐకేపీ ఏపీఎం
దౌల్తాబాద్ మండలం

# ఐదుగురికి సేవా పతకాలు

● పోలీస్ సిబ్బందిని అభినందించిన సీపీ



సేవాపతకాలు పొందిన వారితో సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, జూన్ 3: 2023-24లో ఉత్తమ సేవలు అందించిన పోలీస్ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పతకాలను ప్రకటించింది. సోమవారం పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ వారికి అందజేసి అభినందించారు. డిపార్ట్‌మెంట్‌లో నీతి నిజాయితీ అంకితభావంతో విధులు నిర్వహించే వారికి రివార్డులు, అవార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. క్రమశిక్షణతో పనిచేసే వారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందన్నారు. ఉత్తమ సేవలకు గాను వై.కృష్ణారెడ్డి, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, ఏ.హన్మంతరెడ్డి, ఎస్బీ ఏఎస్ఐ, యు.నాగేశ్వరరావు ఏఎస్ఐ ములుగు, ఎన్.తిరుపతిరెడ్డి హెడ్ కానిస్టేబుల్ త్రీ టౌన్, ఎన్.వెంకట్‌రెడ్డి, కానిస్టేబుల్ గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పతకాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

దుబ్బాక, జూన్ 3: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన దుబ్బాక మున్సిపాలిటి పరిధిలోని లచ్చపేట వార్డులో సోమవారం చోటుచేసుకున్నది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చపేట వార్డుకు చెందిన గూడూరి రంగయ్య(60)అనే వృద్ధుడు డబుల్‌బెడ్ రూం ఇళ్లలో కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. గ్రామంలో చేనేత పనిచేయడానికి సైకిల్‌పై వెళుతుండగా గుర్తుతెలియని వాహనం సైకిల్‌ను ఢీకొట్టడంతో సైకిల్‌పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## హైవే పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్ టౌన్, జూన్ 3 : వర్షాకాలంలో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడకుండా నేషనల్ హైవే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నేషనల్ హైవే అధికారులతో సమావేశమై పనులపై చర్చించారు. రోడ్డుకు ఇరువైపుల మురికి కాలువ నిర్మాణం జరుగుతుండడంతో, వర్షాకాలం దృష్ట్యా అక్కడ ఉన్న విద్యుత్ స్తంభాలు, ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. పనుల్లో అశ్రద్ధ చూపకుండా ఎప్పటికప్పుడు పనులను పూర్తి చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో కమిషనర్ మల్లికార్జున్, ట్రాన్స్‌కో ఏఈ శశిధర్, కౌన్సిలర్లు వల్లపు రాజు, దొడ్డి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, సత్యనారాయణ, అయిలేని శంకర్‌రెడ్డి, ఎండీ అయూబ్ తదితరులున్నారు.

## పాలిసెట్‌లో 140వ ర్యాంకు సాధించిన శ్రీజ




చేర్యాల, జూన్ 3: పాలీసెట్ ఫలితాల్లో చేర్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఇటీవల పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థిని డి. శ్రీజ రాష్ట్రస్థాయిలో 140వ ర్యాంకుసాధించింది. పదవతరగతిలో 9.8జీపీఏ సాధించిన శ్రీజ ఇటీవల పాలీసెట్ పరీక్ష రాయగా, అగ్రికల్చర్ విభాగంలో 140, ఇంజనీరింగ్ విభాగంలో 221వర్యాంకు సాధించింది. ఈ మేరకు శ్రీజను స్థానికులు అభినందించారు.

## తేలనున్న గజ్వేల్ నాయకుల భవితవ్యం

గజ్వేల్, జూన్ 3: మెదక్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై గజ్వేల్ నియోజకవర్గ నాయకుల భవితవ్యం ఆధారపడి ఉన్నది. ఆధిక్యం కోసం కొన్నాళ్లుగా ప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఈ ఎన్నికలతో తమ ఆధిపత్యానికి స్పష్టమైన దారి దొరుకుతుందని బావిస్తున్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో స్పష్టమైన ఆధిక్యం తీసుకురావాలని తీవ్రంగా ప్రయత్నించారు. ఆయా పార్టీలకు చెందిన గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నేతలను కాంగ్రెస్‌లో చేర్పించడంలో సఫలీకృతమయ్యారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు వైపు ఓట్లు మల్లుతాయన్న ఆశతో నర్సారెడ్డి ఉన్నారు. ఇక బీఆర్ఎస్ గజ్వేల్ నాయకుడు, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తన ఆధిక్యాన్ని చూపేందుకు తీవ్రంగా శ్రమించారు. ఆయా గ్రామాలకు, మండలాలకు చెందిన నాయకులు పార్టీని వీడినా ఇతర నాయకులు అధైర్య పడకుండా క్రమశిక్షణతో, నిబద్ధతతో పార్టీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి కోసం కృషి చేశారు. వీరిద్దరి మధ్య ఆధిపత్య పోరులో ఓటర్ల తీర్పు ఎటు వైపు ఉంటుందోనని ఆయా పార్టీల నాయకులు బావిస్తుండగా, బీజేపీ నాయకులు తీవ్రంగా శ్రమించి తమ పార్టీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావుకు భారీగా ఓట్లు తీసుకువచ్చేందుకు కష్టపడ్డారు. ఈ క్రమంలో తమకే భారీగా ఓట్లు పడే అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ నాయకులు బావిస్తున్నారు. మొత్తంగా ఏ పార్టీ వైపు ఓటర్లు నిలిచారో నేడు తేలనుంది.

## 'గిరిజన రిజర్వేషన్లు తగ్గిస్తే ఊరుకోం'



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్

పుల్‌కల్, జూన్ 3: గిరిజనులకు జనాభా ప్రతిపాదికన విద్యా, ఉద్యోగాల్లో అమలవుతున్న 10 శాతం రిజర్వేషన్‌ను తగ్గిస్తే ఊరుకోబోమని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ పేర్కొన్నారు. చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెంలో సోమవారం నిర్వహించిన గిరిజనుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రిజర్వేషన్‌ను విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎవరో ఇద్దరు వ్యక్తులు హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్ నంబర్ డబ్ల్యూపీ నెం.12989/2024పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హైకోర్టులో పూర్తి సమాచారంతో వాదనలు వినిపించాలని డిమాండ్ చేశారు. పది శాతం గిరిజన రిజర్వేషన్ విద్యా ఉద్యోగాల్లో యథాతథంగా కొనసాగేలా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. సమావేశంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు జాదావత్ రవీందర్ కారోబారి, రాములు నాయక్, సంతోష్, మోత్యానాయక్, మెగావత్ సుశీల్‌నాయక్, ప్రకాశ్‌జదావత్, రమావత్ సంతోష్, పాండు, విగ్రేష్‌లు పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశం వాయిదా

బెజ్జంకి, జూన్ 3: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ నిర్మల అధ్యక్షతన నిర్వహించిన సర్వ సభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు గైర్హాజరు కావడంతో సర్వ సభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీపీ నిర్మల తెలిపారు.

## రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం

మిరుదొడ్డి,జూన్3: హైద్రాబాద్‌లోని కూకట్‌పల్లిలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను సోమవారం తెలంగాణ గ్యాస్‌డీలర్ల అసోసియేషన్ సభ్యులు శాలువతో సన్మానించారు.

## సీపీఐ నాయకుడ్ని పరామర్శించిన చాడా

కోహెడ, జూన్ 3: కోహెడ మండలం సముద్రాల గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు వేల్పుల బాలమల్లు అనారోగ్యంతో బాధపడుతూ, హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి సోమవారం ఆయన్ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి నిమ్స్ డాక్టర్లను అడిగి తెలుసుకున్నట్టు బాలమల్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఏటీఎం ప్రారంభం

మిరుదొడ్డి, జూన్ 3: మిరుదొడ్డిలో యూనియన్ బ్యాంకు ఏటీఎంను సోమవారం ఆ బ్యాంకు రీజినల్ హెడ్ వికాస్, రాఘవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంకు ఏటీఎం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఎస్ఐ పరుశురాములు, మేనేజర్ బేమునాయక్ ఉన్నారు.

## మాజీ సర్పంచ్ కన్నుమూత

మద్దూరు, జూన్ 3: మద్దూరు మండలం రేబర్తి గ్రామ మాజీ సర్పంచ్ చిల్వూరి భూపతిరెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

## విద్యుదాఘాతంతో గేదె మృతి

శివ్వంపేట, జూన్ 3: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన సోమవారం కొంతంపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. మండల పరిధిలోని కొంతాన్‌పల్లి గ్రామంలో ఆకుల నరేష్‌కు చెందిన పాడి గేదే గ్రామ శివారులో గడ్డిమేస్తుండగా బోరు స్టార్టర్ కు తగలడంతో, విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. జీవనాధారమైన పాడి గేదె మృతిచెందిందని, ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి తనను ఆదుకోవాలని బాధితుడు నరేష్ కోరుతున్నాడు.



## ఆరోగ్యాన్ని మించిన సంపద ఏదీ లేదు

● వైద్యాధికారి కంటు గౌతమి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న గౌతమి

గజ్వేల్, జూన్ 3: మానవ జీవితంలో ఆరోగ్యానికి మించిన సంపద ఏదీ లేదని వైద్యాధికారి కంటు గౌతమి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో మూడవ రోజు ఆరోగ్యం-పరిశుభ్రత, అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స విధానంపై అవగాహన కల్పించారు. మానవ జీవితంలో ఆరోగ్యానికి మించిన సంపద ఏదీ లేదని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. రాజ్‌గోపాల్‌పేట రేంజ్ వద్ద వంద మంది కెడెట్లకు ఫైరింగ్‌పై ఎన్‌సీసీ అధికారులు నరోత్తంకుమార్, సంధ్యారాణిలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాల్లో సుబేదార్ మేజర్ రామ్‌హరి, క్యాంపు డిప్యూటీ కమాండెంట్ కెప్టెన్ భవాని పాల్గొన్నారు.

## దర్గాలో కాంగ్రెస్ నాయకుల ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేర్యాల, జూన్ 3: పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపొందాలని సోమవారం చేర్యాలలో కాంగ్రెస్ నాయకులు ఎండీ. జహీరుద్దీన్, అంబటి అంజయ్య స్థానిక మామూజీ దర్గాలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపుతో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు.

## బండి సంజయ్ గెలుపు కోసం పూజలు

హుస్నాబాద్ టౌన్, జూన్ 3 : బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్ భారీ మెజార్టీతో గెలువాలని సోమవారం హుస్నాబాద్ మండలం పొట్లపల్లి రాజరాజేశ్వర స్వామికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బత్తుల శంకర్‌బాబు, గొల్లపల్లి వీరాచారి, మడక రవి, గాదాసు రాంప్రసాద్, అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం



వాలిబాల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

ములుగు, జూన్ 3: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహద పడతాయని గజ్వేల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన ములుగులో రైసింగ్ బుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలు ఏర్పాటు చేయడానికి జుబేర్, కరుణాకర్‌రెడ్డి, చింతకింది రాజు, విజయ్ ముందుకురావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు తదితులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తిచేయాలి

● సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి



యూనిఫామ్స్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

కొండపాక, జూన్ 3: పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరగా పూర్తిచేసి పాఠశాలల పునఃప్రారంభం నాటికి అందుబాటులోకి తీసుకురావాలని సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను సోమవారం పరిశీలించారు. ఆయా పాఠశాలలకు మంజూరైన విద్యుద్దీకరణ పనులు, మరుగుదొడ్ల మరమ్మతులు తదితర పనులను పరిశీలించారు. బాలికల పాఠశాలలో పాత పెంకుటి గదులను పరిశీలించి ఐరన్ షీట్‌లు వేసే అంశాన్ని పరిశీలించారు. అలాగే బాలుర పాఠశాలలో పెచ్చులుడుతున్న స్లాబ్ లను చూసి వాటిని పూర్తిగా తొలగించాలని సూచించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని అమ్మ కమిటీ ఏజెన్సీ, సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్యా సంవత్సరం పునఃప్రారంభం నాటికి అన్ని పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులో తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అలాగే అమ్మ ఆదర్శ కమిటీలు, గ్రామ సమాఖ్య సభ్యుల ఆధ్వర్యంలో రవీంద్రనగర్ కేంద్రంలో సిద్ధమవుతున్న యూనిఫామ్‌ల పనులను పరిశీలించారు. ఆయనవెంట కొండపాక ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి రామస్వామి, పీఆర్ ఏఈ తిరుపతిరెడ్డి , ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విఠల్ నాయక్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు ఉన్నారు.

# ఉద్యమంలో దుబ్బాక ప్రజలకు ప్రత్యేక స్థానం

● ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జూన్ 3: తెలంగాణ ఉద్యమ పోరాటంలో దుబ్బాక గడ్డ ప్రజలు చేసిన ఉద్యమానికి ప్రత్యేక స్థానం ఉన్నదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని దుబ్బాక బస్టాండ్ వద్ద సోమవారం జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని సాధించుకుని పదేళ్ల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిపారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులను గౌరవం దక్కలేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు. అనంతరం ఇటీవల రోడ్డుప్రమాదంలో మరణించిన బీఆర్ఎస్ నేత బాలకిషన్ కుటుంబానికి రూ. 2లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు సుజాత, సతీష్‌రెడ్డి, కార్తీకగౌడ్, వెంకటనర్సింహారెడ్డి, మనోహర్‌రావు, రొట్టె రాజమౌళి, ఎల్లారెడ్డి, కౌన్సిలర్లు యాదగిరి, శ్రీనివాస్, బాలకృష్ణా ఉన్నారు.



జై తెలంగాణ నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే, తదితరలు

# ఘనంగా హరీశ్‌రావు జన్మదిన వేడుకలు



గజ్వేల్ పట్టణంలోని నల్లవాగు గడ్డ హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 3: గజ్వేల్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు హరీశ్‌రావు జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గజ్వేల్ జడ్పీటీసీ పంగ మల్లేశం, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, నాయకులు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో హరీశ్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని గ్యారాషహీద్ దర్గాలో బీఆర్ఎస్ మైనారిటీ విభాగం రాష్ట్ర నాయకులు ఖాజా విరసత్ అలీ, టీఎంసీ చైర్మన్ సయ్యద్ యూసుఫ్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నవాజ్ మీరా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో రోగులకు, బాలింతలకు పండ్లను, బ్రెడ్‌ను పంపిణీ చేశారు. గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామానికి చెందిన ఎంకమోల్ల ప్రణీత్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ హరీశ్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకుని రూ.50వేల ఆర్థిక సహాయాన్ని మరికొంతమంది నాయకులు రూ. 25 వేలు మొత్తంగా 75 వేలను అందజేశారు. ఈ కార్యక్రమ్లు నాయకులు పాల్గొన్నారు.

● **కుకునూరుపల్లి:** సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు జన్మదిన వేడుకలను కుకునూరుపల్లి మండల నాయకులు ఘనంగా నిర్వహించారు.

● **బెజ్జంకి:** సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.

● **నంగనూరు:** సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదిన వేడుకలను నంగునూరు మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు.

● **కొండపాక:** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు జన్మదిన వేడుకలను కొండపాక మండలంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.

● **హుస్నాబాద్:** సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో ఆయన అభిమానులు పూజలు నిర్వహించారు.

● **చిన్నకోడూరు:** నాయకమ్మతల్లి దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్షించారు. మండల కేంద్రంలో రెడ్డి జనసేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాయకమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో సోమవారం ఆయన పూజలు చేశారు. అనంతరం మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులు హరీశ్‌రావు పుట్టినరోజు వేడుకలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు.

# స్థానికులకి నో.. బయటివారికి ఎస్

● చేర్యాలలో నర్మెట్ట గురుకుల బాలికల పాఠశాల

● ఇంటిగ్రేటెడ్ హాస్టల్ బిల్డింగ్ కేటాయింపు

చేర్యాల, జూన్ 3: చేర్యాల పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ బిల్డింగ్ ఇక నుంచి నర్మెట్ట మండల గురుకుల బాలికల పాఠశాల/జూనియర్ కళాశాలగా కొనసాగనుంది. ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. స్థానిక ఎస్సీహాస్టల్ విద్యార్థులకు ఆశ్రయం కల్పించకుండా పొరుగు జిల్లాల విద్యాసంస్థలను కొనసాగిస్తూ, అన్యాయం చేయడం తగదంటూ పలు విద్యార్థిసంఘాల నాయకులు నిరసిస్తుండడం వివాదాస్పదమంగా మారింది.

## ఒకే దగ్గర చేర్చేందుకు

గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న బీసీ బాలుర, రెండు ఎస్సీ విద్యార్థుల వసతి గృహాలు అరకొర వసతుల నడుమ కొనసాగుతున్న క్రమంలో ఒకేగూటికి తీసుకువచ్చేందుకు ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనాన్ని నిర్మించారు. కానీ స్థానిక ప్రజాప్రతినిధుల పట్టింపులేనితనంతో సకాలంలో అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. ఇదేక్రమంలో చేర్యాల మండలం సిద్దిపేట జిల్లాలో విలీనమైన సమయంలో సిద్దిపేటకు మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. స్వంతభవనం లేక మెదక్‌లో కొన్నాళ్లపాటు నిర్వహించి, తరువాత కొండపాక మండలంలో కొనసాగించారు. ఇక్కడ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనం నిరుపయోగంగా ఉండడంతో జనవరి 2017లో చేర్యాల భవనంలోకి చేర్చారు. ప్రభుత్వం మారడంతో తిరిగి సిద్దిపేటకు తరలించారు.





హాస్టల్ గోడపైన నర్మెట్ట గురుకుల పాఠశాలగా, హాస్టల్ భవనానికి నర్మెట్ట గురుకుల పాఠశాలగా పేరు రాసిన దృశ్యం

## పాతహాస్టల్ భవన కూల్చివేతతో బీసీ హాస్టల్‌లో

ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనాన్ని గురుకుల కళాశాలకు అప్పగించడంతో చాలాకాలం ఎస్సీ హాస్టల్ విద్యార్థులు పాడుబడిన భవనంలోనే తలదాచుకున్నారు. కానీ రూ.17కోట్లతో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ భవన నిర్మాణంలో ఉన్న పాత హాస్టల్ భవనాన్ని కూల్చివేశారు. దీంతో పట్టణ శివారులోని బీసీ హాస్టల్ భవనంలోని మూడు గదులను కేటాయించినా ఇబ్బందులతో కాలంవెళ్లదీస్తున్నారు.

## ప్రస్తుతం నర్మెట పాఠశాల కొనసాగింపు

సిద్దిపేట మహిళా డిగ్రీకళాశాలను సిద్దిపేటకు తరలించడంతో స్థానిక ఎస్సీ విద్యార్థులకు భవనాన్ని కేటాయిస్తారని సంతోషించినప్పటికీ, జనగామ జిల్లా పరిధిలోని నర్మెట్ట మండల గురుకుల పాఠశాలకు కేటాయించడంతో మరోసారి ఎదురుచూపులే మిగిలాయి. నర్మెట్ట మండలం హన్మంతాపూర్‌లో గురుకుల పాఠశాల నిర్మించేందుకు స్థలకేటాయింపు జరిపినప్పటికీ నిధుల మంజూరులో జాప్యం జరగడంతో కొన్నాళ్లుగా జనగామ పట్టణంలోని అద్దెభవనంలో నిర్వహిస్తున్నారు.

## ఎస్సీ హాస్టల్‌నే కొనసాగించాలని వినతి

ప్రస్తుతం సుమారు 55మంది విద్యార్థులు హాస్టల్‌లో ఉంటున్న క్రమంలో తమ ఇంటిగ్రేటెడ్ భవనాన్ని తమకే కేటాయించాలని విద్యార్థులు, విద్యార్థిసంఘాల నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు జిల్లా అధికారులను కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపి ఎస్సీ హాస్టల్ కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలు అందజేశారు.

## ఆత్మీయ సమ్మేళనం



మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1992-93లో పదోతరగతి చదివిన విద్యార్థులు సోమవారం స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్‌హాల్లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గురువులకు పాదాభివందనం చేసి వారిని సన్మానించారు.

- మద్దూరు